
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
బుధవారం 26 నవంబరు 2025



కంటైనర్‌లో గోవుల తరలింపు
● సిద్దిపేట నుంచి వెంటాడిన గోరక్షణ కమిటీ
● నర్సాపూర్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగింత
● కంటైనర్‌లో కుక్కినట్లు 60 ఆవులు 7

బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి 7



భగలాముఖి సన్నిధిలో పీసీసీ అధ్యక్షుడు



శివ్వంపేటలో తోపులాడుకుంటున్న స్థానిక నాయకులు

పీసీసీ అధ్యక్షుడి సమక్షంలో తోపులాట

బయటపడ్డ గ్రూపుల వివాదం

భగలాముఖిని దర్శించుకున్న మహేష్‌కుమార్ గౌడ్

శివ్వంపేట/నర్సాపూర్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలోని శివ్వంపేటలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లోని గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు బహిర్గతమయింది. భగలాముఖి ఆలయం దర్శనం, యాగశాల ప్రారంభోత్సవానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. స్వాగతం పలికే విషయంలో స్థానిక నాయకులు నవీన్‌గుప్తా, సుదర్శన్‌గౌడ్ వర్గాలకు చెందిన కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే స్పందించి ఇరువర్గాలను చెదరగొట్టి మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆలయానికి తీసుకెళ్లడంతో పరిస్థితి శాంతించింది. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, హన్మంతరావు, డీసీసీ అధ్యక్షులు అంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లోని ఆదిపరాశక్తి అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామపంచాయతీ ఎన్నికలపై..

కాంగ్రెస్ కార్యకర్తలకు జగ్గారెడ్డి దిశానిర్దేశం

సంగారెడ్డి నియోజకవర్గంలోని 84 గ్రామాల ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశం

గ్రామాలవారీగా రిజర్వేషన్లపై ఆరా.. అభ్యర్థుల ఎంపికపై సూచనలు

ఎన్నికల కమిటీ సభ్యులుగా చేర్యాల ఆంజనేయులు, నిర్మల, తోపాజీ అనంతకిషన్, సీడీసీ రాంరెడ్డి, తొగర్‌పల్లి ప్రభు, చిద్రుప్ప రఘుల ఎంపిక

ఆరుగురితోపాటు 4 మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వాళ్ల పరిధిలోని గ్రామాలను పర్యవేక్షించాలని సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని 84 గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జగ్గారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక గురించి ఆరా తీశారు. ఏ గ్రామ అభ్యర్థిని ఆ గ్రామంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయం చేసుకొని ఎంపిక చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఏ అవసరం వచ్చినా ఎన్నికల కమిటీ సభ్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. కొండాపూర్, సదాశివపేట, కంది, సంగారెడ్డి మండలాల పార్టీ అధ్యక్షులు వారి పరిధిలోని గ్రామాలను పర్యవేక్షిస్తారని వివరించారు.



సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న జగ్గారెడ్డి



బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్యనేతలతో కలిసి మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

అధికారులకు సెలవులు రద్దు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి ఆయన డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎంపీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికలయ్యే వరకు అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు జాగరూకతతో వ్యవహరించాలన్నారు. నిఘా బృందాలను నియమించి, కోడ్‌ను అమలు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్ర్కూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్న కోసం తమ్ముడి తాపత్రయం

హత్య తానే చేశానని పోలీసుల ముందుకు..
విచారణలో నిజం తేల్చిన పోలీసులు
ఇద్దరి అరెస్ట్.. రిమాండ్ 7



పల్లెపోరుకు సై

వచ్చే నెల 11, 14, 17 తేదీల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు

మూడు విడతల్లో పోలింగ్ నిర్వహణకు షెడ్యూల్

ఈ నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఉమ్మడి జిల్లాలో 1,663 గ్రామాలు, 14,098 వార్డులు

సంగారెడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూసిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఎట్టకేలకు మంగళవారం నోటిఫికేషన్ వెలువడింది. మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. తొలివిడతకు సంబంధించి ఈ నెల 27 నుంచే నామినేషన్లు స్వీకరించనున్నారు. వచ్చే డిసెంబరు 11న మొదటి విడత, రెండో విడత14న, మూడో విడత 17న పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తారు. చేపట్టనున్నారు. ప్రతీ విడత పోలింగ్‌కు మధ్య మూడు రోజుల సమయం ఇచ్చారు.

అభ్యర్థుల కసరత్తు

గ్రామ పంచాయతీ రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారుకాగా.. తాజాగా షెడ్యూల్ సైతం ప్రకటించారు. దీంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఎంపికచేసే పనిలోపడ్డాయి. మండలాలు, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ఇప్పటికే సగానికి పైగా అభ్యర్థులను ఫైనల్ చేసినట్లుగా తెలుస్తోంది. రేపటి నుంచే తొలి విడత నామినేషన్లు ఉండడంతో ఆ దిశగా అభ్యర్థులను గుర్తిస్తున్నారు. ఇతర ఆశావహులకు నచ్చజెప్పుతూ రెబల్స్ గండం లేకుండా చూసుకుంటున్నారు. పార్టీల గుర్తులు లేకున్నా.. పార్టీల మద్దతే ఇక్కడ కీలకం కాబోతున్నది.

ఆశీస్సులు ఉండాలంటూ..

నోటిఫికేషన్ రావడంతో ఆశావహులు ప్రజలు, నాయకుల ఆశీస్సుల కోసం పాకులాడుతున్నారు. గ్రామాల్లోని ముఖ్యులు, కులసంఘాల పెద్దలను కలిసి మద్దతు కోరుతున్నారు. తమ మద్దతు ఉంటేనే బరిలోకి దిగుతామని, లేదంటే విరమించుకుంటామని చెబుతున్నారు. పల్లెల్లో వ్యూహరచన చేసే నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలించని నేతల కాళ్లావేళ్లా పడుతున్నారు. మంచి హస్తవాసి ఉన్నవారంటూ చెబుతూ పదుల సంఖ్యలో వ్యక్తుల వద్ద నామినేషన్ ఫీజులు తీసుకొని తమ వైపు ప్రసన్నం చేసుకుంనేందుకు సమయం చాలలేదన్నారు.

మెదక్ జిల్లాలో విడతలవారీగా వివరాలు

(492 గ్రామాలు, 4,220 వార్డులు)

తొలివిడత	రెండో విడత	మూడో విడత
160 గ్రామాలు	149 గ్రామాలు	183 గ్రామాలు
1,402 వార్డులు	1,290 వార్డులు	1,528 వార్డులు
అల్లాదుర్గం	తూప్రాన్	నర్సాపూర్
రేగోడ్	మనోహరబాద్	చిలప్‌చెడ్
టేక్మాల్	చేగుంట	కౌడిపల్లి
హవేలిఘనపూర్	నార్సింగి	కుల్చారం
పాపన్నపేట	రామాయంపేట	శివంపేట
పెద్దశంకరంపేట	నిజాంపేట	వెల్దుర్తి
చిన్నశంకరంపేట	మాసాయిపేట	మెదక్

సంగారెడ్డి జిల్లాలో విడతలవారీగా వివరాలు

(613 గ్రామాలు, 5370 వార్డులు)

తొలి విడత	రెండో విడత	మూడో విడత
136 గ్రామాలు	243 గ్రామాలు	234 గ్రామాలు
1,246 వార్డులు	2,164 వార్డులు	1,960 వార్డులు
సంగారెడ్డి	అందోలు	కల్హేర్
కంది	చౌటకూర్	కంగ్టి
కొండాపూర్	పుల్కల్	మనూరు
సదాశివపేట	వట్‌పల్లి	నాగల్‌గిద్ద
పటాన్‌చెరు	రాయికోడ్	నారాయణఖేడ్
గుమ్మడిదల	జరాసంఘం	నిజాంపేట
హత్నూర	జహీరాబాద్	సిర్గాపూర్
మొగుడంపల్లి	న్యాల్‌కల్	కోహీర్, మునిపల్లి



మూడు మున్సిపాలిటీలు..

జీహెచ్‌ఎంసీ పరిధిలోకి

అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం విలీనం

కేబినెట్ మీటింగ్‌లో తీర్మానం.. త్వరలోనే అమల్లోకి

ఇక చైర్మన్లు, కౌన్సిలర్ల స్థానంలో కార్పొరేటర్లు

సంగారెడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) పరిధిని మరింత విస్తృతం చేస్తూ మంగళవారం కేబినెట్ సమావేశంలో తీర్మానించారు. ఈ ప్రభావం సంగారెడ్డి జిల్లాపై పడింది. ఔటర్ రింగురోడ్డు లోపల ప్రస్తుతం మున్సిపాలిటీలుగా కొనసాగుతున్న అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారంలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు సంబంధించి భారతీనగర్, ఆర్సీపురం, పటాన్‌చెరు డివిజన్లు జీహెచ్‌ఎంసీలో ఉన్నాయి. తాజాగా ఈ మున్సిపాలిటీలు సైతం చేరడంతో మరిన్ని డివిజన్లు పెరగనున్నాయి.

ఇక డివిజన్లుగా..

ప్రస్తుతం అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారంలు మున్సిపాలిటీలుగా ఉన్నాయి. ఇకపై జీహెచ్‌ఎంసీ డివిజన్లుగా మారబోతున్నాయి. గతంలోనూ పటాన్‌చెరు, రామచంద్రాపురం మున్సిపాలిటీలుగా కొనసాగి జీహెచ్‌ఎంసీలో విలీనమైన తర్వాత డివిజన్లుగా రూపాంతరం చెందాయి. రెవెన్యూ వ్యవహారాలు మినహా పాలనా వ్యవస్థ మొత్తం జీహెచ్‌ఎంసీ పర్యవేక్షణలోనే ఉండబోతుంది. కాగా 3 మున్సిపాలిటీలను కొత్తగా విలీనం చేయనుండగా.. ఈ మున్సిపాలిటీల స్థానంలో ఎన్ని జీహెచ్‌ఎంసీ డివిజన్లు ఏర్పడుతాయన్నదే ప్రశ్నగా మారింది. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో భాగంగానే అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారంలలో ఓట్ల జాతర జరగనున్నది.

పదవులకు ఎసరు

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్, వైస్‌చైర్మన్, 24 మంది వార్డు కౌన్సిలర్లు, తెల్లాపూర్‌లో చైర్మన్, వైస్‌చైర్మన్ సహా 17 మంది కౌన్సిలర్లు, ఐడీఏ బొల్లారంలోనూ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు 22 వార్డులు ఉన్నాయి. వీరుగాకుండా కో-ఆప్షన్ సభ్యులు అదనంగా ఉంటారు. 3 మున్సిపాలిటీల్లో కలిపి సుమారు 80 పదవులను గత ఐదేళ్లలో అనుభవించారు. తాజాగా జీహెచ్‌ఎంసీలో చేరడంతో ఈ పదవులన్నీ రద్దవుతున్నాయి. ఒక మున్సిపాలిటీకి ఒక జీహెచ్‌ఎంసీ డివిజన్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం 3 మున్సిపాలిటీలను విలీనం చేస్తున్నందున ఓటర్ల సంఖ్య ఆధారంగా 7 నుంచి 8 జీహెచ్‌ఎంసీ డివిజన్లు ఏర్పడే అవకాశం ఉంది. ఈ లెక్కన 80 పదవుల స్థానంలో కేవలం సింగిల్ నంబర్‌లోనే పదవులు పొందనున్నారు. మిగితావారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతోంది. ఒకప్పుడు పటాన్‌చెరు మున్సిపాలిటీ పరిధిలో 20 మంది వార్డు కౌన్సిలర్లు ఉండగా ప్రస్తుతం ఒక్కరే కార్పొరేటర్ ఉన్నారు. ఇదే పరిస్థితి రిపీట్ అవుతుందని అంచనా వేస్తున్నారు.

కార్పొరేట్ సంస్థల సహకారంతో

వసతిగృహాల అభివృద్ధి : కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకురావాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని బీసీ బాలుర, బాలికల హాస్టల్ విద్యార్థులకు కిర్బీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో అందజేసిన సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 34 బీసీహాస్టళ్ల విద్యార్థులకు కిర్బీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులు రూ.29.89 లక్షలతో సామగ్రిని అందజేసిందని తెలిపారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి జగదీశ్, కిర్బీ వైస్ ప్రెసిడెంట్ రాజమహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పీసీబీ అధికారులను సస్పెండ్ చేయండి

ఆందోళనకు దిగిన దోమడుగు గ్రామస్థులు

గుమ్మడిదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలను రసాయన వ్యర్థాలతో కలుషితం చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామస్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సిద్ధమయ్యారు. కలుషిత జలాలతో చేపలు చనిపోతున్నాయని, సాగుకు నీరు వినియోగించలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వ్యర్థాలను ఎలాంటి శుద్ధి వ్యవస్థలు లేకుండా నేరుగా చెరువులోకి విడుదల చేస్తున్నప్పటికీ పట్టించుకోని పీసీబీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దోమడుగు వాసులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వెంగళరావు నియామకం



వెంగళరావు ఫొటో

చేగుంట నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తాడెం వెంగళరావు మంగళవారం నియమితులయ్యారు. డైరెక్టర్లుగా నర్సింహులు, ముజామిల్, ఫకీర్, శ్రీనివాస్, అంజనేయులు, బాల్‌రెడ్డి, లక్ష్మీ, శ్రీధర్‌రెడ్డి, వినోద్‌కుమార్, అబ్దుల్‌రఫీక్, లక్ష్మణ్, రమేష్‌ను ఎంపికయ్యారు. చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన నియామకానికి కృషి చేసిన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి వెంగళరావు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

మహిళా సంఘాలను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్‌దే

వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివద్ధి సాధ్యమని, అన్ని రంగాల్లో మహిళలను చైతన్యం చేస్తేనే సమాజంలో మార్పు వస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పావలా వడ్డీ రుణాలను తొలిసారి అమలు చేసిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆ తరువాత సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా మహిళా సంఘాలకు మద్దతునిచ్చారని గుర్తుచేశారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ మహిళాభివృద్ధిని మర్చిపోయిందని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో మూడు సార్లు రుణాలను అందజేసి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తుందన్నారు. అభయహస్తం, ఆమ్‌ఆద్మీ బీమా, గృహజ్యోతి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ పంపుల కేటాయింపు, సన్న బియ్యం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గ్రూపులకు భాగస్వామ్యం ఇచ్చిన ప్రజాపాలన తమదేనన్నారు. నాడు ఇందిరమ్మను మెదక్ జిల్లా ప్రజలు అత్యధిక మెజార్టీతో ఎన్నుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇందిరమ్మ ఉక్కు మహిళ అని, ఆమె పేదలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. భూమిలేని పేదలకు భూములు పంపిణీ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపింది ఇందిరమ్మేనని మంత్రి పేర్కొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

15,909 సంఘాలకు రూ.18.25 కోట్లు వడ్డీ లేని రుణాలు

నియోజకవర్గంలోని 4,039 మహిళా సంఘాలకు రూ.4.52 కోట్లు, జిల్లాలోని 15,909 సంఘాలకు మొత్తం రూ.18.25 కోట్లు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శకులు కావాలన్నారు.

జిల్లాకు ఇద్దరు కొత్త డిప్యూటీ డీఎంహెచ్‌వోలు

● జహీరాబాద్‌కు డా.లక్ష్మీశైలజ ● 'ఖేడ్'కు డా.శ్రీనివాసరావు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్)లకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా.రవీందర్ నాయక్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జహీరాబాద్(కోహీర్) డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డా.ఎ.లక్ష్మీశైలజ, నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డా.పి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆర్సీపురం మెడికల్ ఆఫీసర్(ఎన్‌సీడీ, ఎయిడ్స్ అండ్ లెప్రసీ-పీవో) డా.మహేందర్‌రెడ్డి పదోన్నతిపై సిద్దిపేట డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. మనూర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.నర్సింగ్‌చౌహాన్ ఎల్లారెడ్డి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. బొల్లారం మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నిర్మలరెడ్డి పదోన్నతిపై సిద్దిపేట డీఎంహెచ్‌వో కార్యాలయానికి ప్రోగ్రాం ఆఫీసర్‌గా నియమితులయ్యారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో పనిచేస్తున్న డా.కె.సంజయ్ గద్వాల జీజీహెచ్‌కు, అదే విధంగా డా.కపూర్ ములుగు జీజీహెచ్‌కు పదోన్నతిపై నియమితులయ్యారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం చేయొద్దని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మార్కెట్ యార్డులోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రిజిస్టర్లను సరిగా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేసి మాట్లాడారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం లింగాపూర్‌లోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, పరిశీలించారు. అలాగే నర్సాపూర్ మార్కెట్‌యార్డులోని ఇసుక బజార్‌ను కూడా సందర్శించి, తనిఖీ చశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నర్సాపూర్‌లోని మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం లింగాపూర్‌లోని రైతువేదికలో వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, ఏపీవో సంగమేశ్వర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలి

● నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి త్వరితగతిన పూర్తిచేసి, బాధితులకు న్యాయం చేయాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసుల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో నేరాల పరిస్థితి, పెండింగ్ కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. అనంతరం స్పెషల్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

కంకర ట్రాక్టర్ బోల్తా, డ్రైవర్ మృతి



వడ్డెర రాజు (ఫైల్)

రామాయంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కంకర మిషన్ నుంచి లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన రామాయంపేట మున్సిపల్ పరిధి కోమటిపల్లి శివారులో మంగళవారం విషాదాన్ని నింపింది. కోమటిపల్లి వడ్డెర కాలనీకి చెందిన రాజు (అలియాస్) గోపి(30) కంకర ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. కంకర లోడ్ చేసుకుని వస్తున్న క్రమంలో రోడ్డు గుంతలుగా ఉండడంతో ఒక్కసారిగా ఒరిగి పడిపోయింది. ఈ ఘటనలో రాజు ట్రాలీ కింద నలిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య



మఠం జశ్వంత్ (ఫైల్)

చేగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తల్లి మందలించిందని మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మట్టం స్వప్న, నర్సింలకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కూతురు వివాహం చేశారు. కుమారుడు జశ్వంత్(18) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఎలాంటి పనిచేయకుండా ఇంట్లో ఖాళీగా ఉండడంతో తల్లి పనిచేసుకోవాలని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన జశ్వంత్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉద్యోగం పోయిందని..



ప్రవీణ్(ఫైల్)

కౌడిపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం పోయిందని మనోవేదనతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన చంద్రం ప్రవీణ్‌గౌడ్(39) కొంతకాలంగా ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం డ్రైవర్ పనికి వెళ్లగా ఉద్యోగం లేదని చెప్పారు. తిరిగి ఇంటికొచ్చి భోజనం చేస్తూ ఉద్యోగం పోయిందని మనోవేదన చెందాడు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడు..



ఉమామహేశ్వర్ మృతదేహం

పాపన్నపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది ఉమామహేశ్వర్(23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య దీపికతో కొన్నిరోజులుగా సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇంట్లోంచి వెళ్లిన ఉమామహేశ్వర్ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామంలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

వెల్దుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. వెల్దుర్తి మండలం శేరి గ్రామానికి చెందిన బండ యాదగిరికి చెందిన పాడిగేదెను రోజులాగే మేత కోసం గ్రామ శివారుకు తోలుకెళ్లాడు. మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు అక్కడిక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని యాదగిరి కోరాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెల్దుర్తి/జహీరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. వెల్దుర్తి మండల పరిధి మన్నెవారి జలాల్‌పూర్‌కు చెందిన కమ్మరి రుక్కమ్మ, పాండరి ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు గమనించి మంటలు ఆర్పినా అప్పటికే బియ్యం, బట్టలు, వంట సామగ్రి, టీవీ దగ్ధమయ్యాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ ఘటనా స్థలానికి చేరుకోని పంచనామా నిర్వహించారు. అలాగే జహీరాబాద్‌లోని పాత ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని రావూస్ పాఠశాల సీఈవో నిధిన్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం పిల్లలను కాపాడిన డ్రైవర్‌ను సన్మానించారు.







మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల, పూర్తయిన తాత్కాలిక రేకులషెడ్డు నిర్మాణం, చెట్ల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థులు

చలికి చస్తున్నాం.. ఎప్పుడు ఓపెన్ చేస్తరు..

- రేకుల షెడ్డు పూర్తయినా ప్రారంభించని అధికారులు
- చలికి వణుకుతున్న విద్యార్థులు

మునిపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చలికి చస్తున్నాం.. తాత్కాలిక రేకుల షెడ్లు ఎప్పుడు ఓపెన్ చేస్తారని విద్యార్థులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పరిధిలోని లింగంపల్లి గురుకుల సొసైటీ వసతి భవనం సెప్టెంబరు 9న కూలిన విషయం తెలిసిందే. మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు, గురుకులాలకు సంబంధించిన అధికారులు సందర్శించారు. విద్యార్థులు బస చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ ఆ దిశగా అడుగులు పడలేదు. ఈ విషయమై సెప్టెంబరు 24న 'విద్యార్థుల వసతి ఎక్కడ..?' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు గతంలో ఎల్అండ్‌టీ సహకారంతో నిర్మించిన స్కూల్ బిల్డింగ్‌పై తాత్కాలిక షెడ్డు నిర్మాణ పనులను సెప్టెంబరు 24న ప్రారంభించారు. వారంరోజుల క్రితం పనులు పూర్తయినా షెడ్డు ఓపెన్ చేయలేదు. దీంతో పాఠశాల పాత భవనంపై ఉన్న రేకుల షెడ్డులో బస చేస్తున్న విద్యార్థులు చలికి వణుకుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక రేకుల షెడ్లను వెంటనే ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'షీక్యాబ్'తో గిరిజన మహిళకు ఉపాధి

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



జహీరాబాద్‌లో గిరిజన మహిళ లక్ష్మీబాయికి వాహన తాళాన్ని అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్/సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'షీక్యాబ్'తో గిరిజన మహిళకు స్వయం ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ తెలిపారు. జహీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జహీరాబాద్‌కు చెందిన లబ్ధిదారు లక్ష్మీబాయికి డ్రైవర్ కమ్ ఓనర్ పథకం కింద (యూనిట్ కాస్ట్ రూ.9 లక్షలు) మంజూరైన కారు వాహనాన్ని ఎంపీ మంగళవారం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీటీడీవో వెంకటేశం, నీలిమ, బ్యాంచ్ మేనేజర్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగు ప్రాజెక్టు నీటిని ఎక్కడికీ తరలించం

- యాసంగి పంటలకే ప్రాజెక్టు నీరు
- రైతులు అపోహలు నమ్మొద్దు : ఎమ్మెల్యే



సంజీవరెడ్డి

కల్హేర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు నీటిని యాసంగిలో పూర్తిస్థాయిలో ఆయకట్టు పరిధిలోని కల్హేర్, సిర్గాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల భూములకే సరఫరా చేస్తామని, ఇందులో రైతులు అపోహలకు గురికావద్దని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేని వారు నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులను అపోహలకు గురిచేస్తూ లేని పోనీ అనుమానాలకు గురిచేస్తున్నారన్నారు. ప్రాజెక్టు నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సచించారు. నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కల్హేర్, సిర్గాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల రైతులతో పాటు ఎడమకాలువ పరిధిలోని కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మార్‌దండ, తిమ్మానగర్ గ్రామాలకు చెందిన రైతులతో నల్లవాగు ప్రాజెక్టు వద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు దూళిమిట్ట విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మద్దూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాస్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ ఎంపికల్లో దూళిమిట్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు సందీప్, వశీకర్, ఓంకార్, యోగి అద్భుత ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి 30 వరకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందున విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కర్ణాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రజాబాట

తూప్రాన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేపట్టేందుకు ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ (ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లా) చీఫ్ ఇంజనీర్ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలో ప్రజాబాటను ఎస్ఈ నారాయణనాయక్‌తో కలిసి పరిశీలించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు పరిశీలించి బాగుచేస్తున్నట్లు వివరించారు. ఇందులో తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్మంత్‌రాజ్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్‌లో గోవుల తరలింపు

- సిద్దిపేట నుంచి వెంటాడిన గోరక్షణ కమిటీ
- నర్సాపూర్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగింత
- కంటైనర్‌లో కుక్కినట్లు 60 ఆవులు



ఆందోళనకు దిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ తదితరులు

నర్సాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కంటైనర్‌లో ఎవరికీ అనుమానం రాకుండా గోవులను తరలిస్తుండగా, సమాచారం అందుకున్న గోరక్షణ కమిటీ ప్రతినిధులు సిద్దిపేట నుంచి వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. సుమారు 60 గోవులను కంటైనర్‌లో కుక్కి తీసుకువెళ్తుండగా పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. సిద్దిపేట వైపు నుంచి ఓ కంటైనర్ వాహనంలో సుమారు 60 వరకు గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుసుకున్న గోరక్షణ కమిటీ ప్రతినిధులు అక్కడి నుంచే వాహనాన్ని వెంబడించారు. అయితే, కంటైనర్‌లోని వ్యక్తులు వారికి దొరకకుండా వేగంగా వాహనం నడుపుతూ ముందుకు సాగారు. ఈ క్రమంలో కంటైనర్ మెదక్ జిల్లా నర్సాపూర్‌కు వచ్చింది. నర్సాపూర్ చౌరస్తాలో సిగ్నల్ పడటంతో గోవులు ఉన్న కంటైనర్ ఆగింది. ఈ క్రమంలో గోరక్షణ కమిటీ ప్రతినిధులు కంటైనర్‌ను పట్టుకునేందుకు వెళ్లగా, తప్పించుకునేందుకు ప్రయత్నించారు. స్థానికులతో కలిసి గోరక్షణ కమిటీ సభ్యులు ఎట్టకేలకు కంటెనర్‌ను పట్టుకున్నారు. కంటైనర్ తెరిచి చూడగా, అనుమానించినట్లే అందులో సుమారు 60 వరకు గోవులు కిక్కిరిన స్థితిలో ఉండగా, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో వచ్చి కంటైనర్‌ను స్థానిక జూనియర్ కళాశాల మైదానికి తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వి.మల్లేశ్‌గౌడ్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఎస్ఐ వారికి నచ్చచెప్పి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇచ్చారు. గోవులను గోశాలకు తరలించి సంరక్షిస్తామని చెప్పారు. గోవులు తరలిస్తున్న విషయమై పూర్తి విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో గోరక్షణ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



నర్సాపూర్‌లో పట్టుకున్న గోవులతో ఉన్న కంటైనర్

అన్నకోసం తమ్ముడి తాపత్రయం

- హత్య తానే చేశానని పోలీసుల ముందుకు..
- విచారణలో నిజం తేల్చిన పోలీసులు
- ఇద్దరి అరెస్ట్.. రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

కుకునూరుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని సొంత మేనల్లుడిని ఓ మేనమామ కారుతో ఢీ కొట్టి హత్య చేశాడు. అయితే, ఆ హత్య కేసును తన మీద వేసుకుని నిందితుడి తమ్ముడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. విచారణలో అన్నే హత్య చేశాడని నిర్ధారించిన పోలీసులు నిందితుడితోపాటు తమను తప్పుదారి పట్టించిన సోదరుడినీ అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌లు వెల్లడించారు. వారి కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా చాట్లపల్లికి చెందిన ఖదీర్ నాలుగేళ్ల క్రితం భువనగిరికి చెందిన తన మేనల్లుడు షాహీద్‌ను తీసుకువచ్చి తన వద్దే ఉంచుకుని, పనులు చేయించుకునేవాడు. ఈ క్రమంలో తన భార్యతో షాహీద్ ఫోన్‌లో మాట్లాడుతూ సన్నిహితంగా ఉంటున్నాడని ఖదీర్ అనుమానించాడు. తన సోదరి అయిన షాహీద్ తల్లికి విషయం చెప్పి హెచ్చరించినా అతనిలో మార్పు రాలేదు. గత శనివారం షాహీద్.. ఖదీర్ భార్యను కలిశాడు. ఈ విషయం తెలిసి ఖదీర్ మేనల్లుడిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. అదే క్రమంలో షాహీద్ బైక్‌పై వెళ్తున్నాడని తెలుసుకున్నాడు. షాహీద్ బైక్‌పై మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామ శివారులోకి రాగా, అప్పటికే అతనిని వెంబడిస్తున్న ఖదీర్ తన కారుతో బైక్‌ను బలంగా ఢీ కొట్టాడు. షాహీద్‌కు తీవ్రంగాయాలు కాగా, చనిపోలేదని భావించి మరోమారు కారుతో బలంగా ఢీకొట్టాడు. మేనల్లుడు మరణించాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న కుకునూరుపల్లి పోలీసులు నిందితుడి కోసం రెండు బృందాలను ఏర్పాటుచేసి గాలిస్తుండగా, ఖదీర్ తమ్ముడు మహ్మద్ షబ్బీర్ తానే హత్య చేసినట్లు పోలీసుల వద్దకు వచ్చి చెప్పాడు. అయితే, సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు షబ్బీర్ హత్య చేయలేదని, అతని అన్న ఈ హత్య చేసినట్లు నిర్ధారించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా, అన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నందున కేసు కావద్దనే ఉద్దేశంతో ఈ హత్య కేసును తన మీద వేసుకున్నట్లు షబ్బీర్ ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడు ఖదీర్‌తో పాటు పోలీసులను తప్పుదోవ పట్టించిన షబ్బీర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు



నిర్మల్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ కవిత స్రవంతి

జగదేవ్‌పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని హౌజింగ్‌శాఖ డీఈ కవిత స్రవంతి అన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలం నిర్మల్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను, ఇంటి నిర్మాణ పనులు పూర్తయిన లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల విడుదల, పనుల పురోగతి, నిర్మాణంలో ఎదురయ్యే సమస్యల గురించి వివరాలు సేకరించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ పనుల్లో సాంకేతిక సమస్యలు, బిల్లుల విషయంలో ఇబ్బందులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు పూర్తయిన లబ్ధిదారులకు బిల్లులు అందని పక్షంలో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని మండల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, హౌజింగ్ ఏఈ విశాఖ, ఎంపీవో కాజా మొయినొద్దీన్, అల్లిరాజపేట్ మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, నిర్మల్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయండి

- వయోజన విద్య ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి



మహిళలకు పంపిణీ చేసిన 'అమ్మకు అక్షరమాల' పుస్తకాలతో వెంకట్‌రెడ్డి

కల్హేర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్షరాలు రాని మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పొదుపు సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కే.వెంకట్ రెడ్డి కోరారు. మంగళవారం కల్హేర్‌లోని స్త్రీశక్తి భవనంలో ఉల్లాస్ కార్యక్రమ నిర్వహణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళల్లో అధిక శాతం నిరక్షరాస్యులు ఉన్నారని, వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత చదువు వచ్చిన సభ్యులదేనని వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరాక్రాంతి పథం సిబ్బంది శోభన్, సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి రేణుక, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- పరిశ్రమ ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన



బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమ ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమలో చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్న కార్మికులను తొలగిస్తుంటే కార్మికశాఖ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ (సీఐటీయూ) కన్వీనర్, బిస్లరీ యూనియన్ అధ్యక్షుడు అతిమేల మాణిక్ ప్రశ్నించారు. మంగళవారం ఐడీఏ పాశమైలారంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకున్నారని, దీంతో యాజమాన్యం కక్షసాధింపు చర్యలతో ఐదుగురిని చట్టానికి విరుద్ధంగా తొలగించిందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో క్లస్టర్ సీఐటీయూ నాయకుడు రాజు, యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, కోశాధికారి నవీన్, జాయింట్ సెక్రటరీ అజయ్, కమిటీ సభ్యుడు రాము పాల్గొన్నారు.

చలికాలంలో విక్రయానికి తాటి ముంజలు



ఖేడ్‌లో విక్రయానికి వచ్చిన తాటి ముంజలు

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాటి ముంజలు సహజంగా వేసవికాలం ప్రారంభం నుంచి లభిస్తాయి. ప్రస్తుతం గజగజ వణికించే చలికాలంలో ముంజలు విక్రయించేందుకు రావడంతో జనాలు కొనుగోలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ సంతలో మంగళవారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మల్లూర్‌కు చెందిన తుకారం,గణేష్ ముంజలను విక్రయానికి తీసుకొచ్చారు. సీజన్‌లో అమ్మిన ధరలకే ప్రస్తుతం కూడా వందకు డజను చొప్పున విక్రయించారు. ఈ విషయమై విక్రయానికి వచ్చిన తుకారం, గణేష్‌లను ప్రశ్నించగా, కాత ఇప్పుడిప్పుడే ప్రారంభమైందని, అందువల్ల విక్రయించడానికి తీసుకువచ్చామని తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



నిందితులను చూపుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

రామాయంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎనిమిది చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ ఆరుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ ఎస్పీ డివి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మెదక్ ఎస్పీ కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఈనెల 18న రామాయంపేట మండల పరిధి ధర్మారం రైస్‌మిల్లులో సదరు ముఠా రైస్‌మిల్లు తాళాలు పగులగొట్టి వస్తువులు ఎత్తుకెళ్లారు. దౌల్తాబాద్ చౌరస్తాలో తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న వీరిని పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. ధర్మారం, చేగుంట, మెదక్, తూప్రాన్, మనోహరాబాద్, శివంపేట, గౌరారం ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి టాటా ఏస్ వాహనం, కటింగ్ మిషన్లు, ఇనుప రాడ్లు, రెండు కేజీల కాపర్ వైర్లు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

సౌదీలో ట్రక్ బోల్తా..

- మెదక్ యువకుడు మృతి



నంగి వెంకట్(ఫైల్)

మెదక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొట్ట చేత పట్టుకుని ఎడారి దేశం వెళ్లిన మెదక్‌కు చెందిన ఓ యువకుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మెదక్‌కు చెందిన నంగి వెంకట్(35) స్థానికంగా డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగించేవాడు. మరింత ఉన్నతంగా బతికేందుకు ఏడాది క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడే ట్రక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి ట్రక్ నడుపుతుండగా, సౌదీలోని జుబేదాలీ పట్టణం సమీపంలో ట్రక్ టైర్ పగిలి వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ సీటులో ఉన్న వెంకట్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మెదక్ పట్టణంలోని నవాబుపేట వీధిలో నివాసం ఉంటున్న వెంకట్ భార్య ఎల్లమ్మకు సౌదీలోని కంపెనీ యాజమాన్యం సమాచారం అందించింది. వెంకట్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వార్డు మాజీ కౌన్సిలర్ ముత్యంగౌడ్.. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి వెంకట్ పనిచేస్తున్న కంపెనీ యజమానితో ఫోన్‌లో మాట్లాడారు. మృతదేహాన్ని త్వరగా పంపించే ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మృతుడు వెంకట్‌కు భార్య ఎల్లమ్మతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అట్టహాసంగా 'కార్నివల్'

- హాజరైన ఆర్‌సీవో రాజేశం



కార్నివల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌సీవో రాజేశం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మంజీరానగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి విద్యా సంబంధమైన(లిటరరీ), కల్చరల్ కార్నివల్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డిబేట్, మిమిక్రీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ రీజినల్ కో ఆర్డినేటర్(ఆర్‌సీవో) రాజేశం మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కార్నివల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ధన్‌రాజ్, సంతోషి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పీఎంశ్రీ క్రీడా పోటీలు ప్రారంభం

జిన్నారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిన్నారం గురుకుల పాఠశాలలో పాఠశాల స్థాయి పీఎంశ్రీ క్రీడా పోటీలను ఎంఈవో కుమారస్వామి ప్రారంభించారు. మంగళవారం గురుకుల పాఠశాల వద్ద మండల పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్రీడా పోటీలను ప్రారంభించారు.

జహీరాబాద్‌లో ఐక్యతా పాదయాత్ర

జహీరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) ఏక్ భారత్.. శ్రేష్ఠభారత్ స్ఫూర్తితో మంగళవారం జహీరాబాద్ పట్టణంలో జాతీయ ఐక్యతా మార్చ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లాభాయ్ పటేల్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు కొనసాగలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, ఎస్‌ఐలు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

నారాయణఖేడ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నారాయణఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సామూహిక వందేమాతరం గేయాలాపనలో మాజీ ఎంపీ బీబీపాటిల్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేవైఎం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. అంతకుముందు నారాయణఖేడ్‌లో బీజేపీ నాయకులు, విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేన్‌దేశ్‌పాండే, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్, మండల అధ్యక్షులు దశరత్‌కురుమ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి మదిలో దేశభక్తిని నింపాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి మదిలో దేశభక్తిని నింపాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి పిలుపునిచ్చారు. వందేమాతర గేయాన్ని రచించి 150 సంవత్సరాలు గడిచిన సందర్భంగా మంగళవారం సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోని శివాజిచౌక్ వద్ద సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాణిరుద్రమదేవి మాట్లాడుతూ వందేమాతర స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, నాయకులు ఉన్నారు.

సిగాచి మృతుల కుటుంబాలకు పూర్తి నష్టపరిహారాన్ని అందించాలి

పటాన్‌చెరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిగాచి మృతుల కుటుంబాలకు వెంటనే పూర్తి నష్టపరిహారాన్ని అందించాలని, నాలుగు నెలలు గడుస్తున్నా బాధితులని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఆయన మంగళవారం ఇస్నాపూర్‌లో తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధపు లెక్కలతో బాధిత కుటుంబాలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కార్మికశాఖ మంత్రి కార్మిక సంక్షేమాన్ని మరిచారన్నారు. స్వయానా రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రకటించిన కోటి రూపాయలలో మిగతా మొత్తం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని సీఎంకి బహిరంగ లేఖ రాసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సిగాచి మృతుల కుటుంబాలకు త్వరగా పూర్తి స్థాయిలో నష్టపరిహారాన్ని అందించాలని, లేని పక్షంలో మరొక్కసారి ఉద్యమించాల్సిఉంటుందని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకులు ప్రకటనలకే పరిమితం

సంగారెడ్డి రూరల్/సదాశివపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు ప్రకటనలకే తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు చేయడం లేదని విమర్శించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంగారెడ్డి పట్టణ, మండలం, కంది, కొండాపూర్, మండలాల లబ్ధిదారులకు రూ.21.33 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా సదాశివపేటలోని ఎమ్మెల్యే నివాసం క్యాంపు కార్యాలయంలో సదాశివపేట మండలానికి చెందిన 50మంది లబ్ధిదారులకు రూ.11.90లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కొండాపూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్, సదాశివపేట మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని నారాయణరెడ్డి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కాంగ్రెస్‌పై బురద చల్లడం మానుకోండి

తూప్రాన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ అవుసుల కుంట విషయంలో కాంగ్రెస్‌పై బురద చల్లడం మానుకోవాలని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.అవుసుల కుంటపై గతంలోనే ఇరిగేషన్ అధికారులు లేఖలు ఇచ్చారని పేర్కొంటు, వాటికి సంబంధించిన పత్రాలు చూపించారు. కొందరు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.

కోహీర్‌లో మార్చురీ లేక ఇబ్బందులు

- పోస్టుమార్టం కోసం మృతదేహాలను జహీరాబాద్‌కు తరలించక తప్పని పరిస్థితి
- 25 కి.మీ దూరాభారం, సమయాభావంతో మృతుల కుటుంబాలకు ఇక్కట్లు

కోహీర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన కోహీర్ మున్సిపల్ పట్టణంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ విభాగం లేకపోవడం వల్ల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదవశాత్తు, అనుమానాస్పదంగా, ఆత్మహత్యలు చేసుకున్న వారి మృతదేహాలను భద్రపరిచి పోస్టుమార్టం నిర్వహించేందుకు కోహీర్‌లో మార్చురీ లేకపోవడం వల్ల జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాలను తరలిస్తున్నారు. గత కొన్నేళ్లుగా కోహీర్‌లో పోస్టుమార్టం సేవలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోహీర్ మండలానికి జహీరాబాద్ 25 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల మృతదేహాలను అక్కడికి తీసుకువెళ్లి పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తుంది. దీంతో సమయం వృథాతోపాటు సకాలంలో పోస్టుమార్టం కాకపోవడం వల్ల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని స్థానికులు పేర్కొంటున్నారు. 12 ఏళ్ల క్రితం కోహీర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పోస్టుమార్టం విభాగం ఉన్నప్పటికీ, సదరు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో కోహీర్‌లో మృతదేహాలకు పోస్టుమార్టం చేయడం నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ కింద కోహీర్ పట్టణంలో రెండేళ్ల క్రితం 50 పడకల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి నిర్మించినప్పటికీ పోస్టుమార్టం నిర్వహించే మార్చురీనీ మాత్రం ఏర్పాటు చేయలేదు. గతంలో కోహీర్ ఉన్న మార్చురీకి అవసరమైన మరమ్మతులు చేసి పునఃప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కోహీర్‌లో శిథిలావస్థకు చేరి ముళ్ల పొదల్లో దర్శనమిస్తున్న పాత మార్చురీ

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో స్వయంసహాయక మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ



జహీరాబాద్‌లో మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కు అందజేస్తున్న ఎంపీ



పాపన్నపేట: పొడిచాన్‌పల్లి చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట/చిన్నశంకరంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట మండలం పొడిచాన్‌పల్లి గ్రామ రైతు వేదికలో ఏర్పాటుచేసిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఒకేపనికి పరిమితం కాకుండా, అని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలోని స్వయంసహాయ సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల రాయితీ కింద రూ.30.50కోట్ల విలువైన చెక్కులను అందించినట్టు తెలిపారు. మంగళవారం ప్రత్యేకంగా 11 వేల మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.8.89 కోట్లు వడ్డీరాయితీ అందించామన్నారు కార్యక్రమంలో డీపీఎం వెంకటేష్, పాపన్నపేట ఎంపీడీవో విష్ణువర్ధన్, ఏపీఎం రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు అదనపు కలెక్టర్ నాగేష్ ఇతర అధికారులతో కలిసి మెదక్ నియోజకవర్గంలోని 3100 మహిళా సంఘాలకు 2,87,74,00 వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మామోదర్, ఏపీఎం రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే లక్ష్యం: ఎంపీ

జహీరాబాద్/మునిపల్లి/రాయికోడ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలో ఓ ఫంక్షన్ హాలో నియోజక వర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్, మొగడంపల్లి మండలాల మహిళా సంఘాల సభ్యులకు రూ.3.38 కోట్లు వడ్డీ లేని రుణాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. మునిపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారిలు స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల కింద రూ.82లక్షల చెక్కులను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాభవాని, ఎంపీడీవో హరినందన్ రావు, ఇతర అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు. రాయికోడ్‌లోని రైతు వేదికలో మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు చీరలను సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య పంపిణీ చేశారు. అలాగే నాగ్వార్, సింగితం గ్రామాల్లో గ్రంథాలయ రీడింగ్ రూంలను ప్రారంభించారు.

మహిళాసాధికారతకు అధిక ప్రాధాన్యం



ఖేడ్‌లో మహిళా సంఘాలకు సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/పెద్దశంకరంపేట/ నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్థానిక సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి నియోజకవర్గంలోని 3,083 స్వయం సహాయక బృందాలకు రూ.3 కోట్ల 4 లక్షల వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక, ప్రజాపాలనలో మహిళా సాధికారితకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు హసీనాబేగం, నాగమణి, ఐకేపీ ఏపీఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ మండల పరిధిలోని తుర్కపల్లిలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా నాగల్‌గిద్ద మండల పరిధిలోని ముక్తాపూర్, కారముంగి, ఏస్గీ, వల్లూర్, గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఇందిర మహిళా శక్తి చీరలను స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని రైతు వేదికలో 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పాత గ్రామపంచాయతీ ఆవరణలో, పాత బస్టాండ్ ఆవరణలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పెద్దశంకరంపేటలో రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో పేట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో షాకీర్‌అలీ, నాయకులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో మహిళలకు చీరల పంపిణీ

పుల్‌కల్/హత్నూర/రేగోడు , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి చీరలను మంగళవారం ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి పంపిణీ చేశారు. చౌటకూర్ మండలంలోని చక్రియాల, బొమ్మారెడ్డిగూడెం, పోసానిపల్లి తదితర గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో చక్రియాల కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. హత్నూర మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. హత్నూరలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్వప్న, ఎంపీడీవో శంకర్, గ్రామ కార్యదర్శి సాయికుమార్ పాల్గొన్నారు. రేగోడు మండలంలోని పెద్దతండ గ్రామపంచాయతీలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సంగ్యా నాయక్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు.

పేరుకే 24గంటల ఆస్పత్రి..

సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కల్హేర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్‌లోని 24 గంటల పాటు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి. సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ఏ ఒక్కరూ అందుబాటులో లేకపోవడంతో ఆశ్చర్యపోయారు. కాగా నిత్యం మధ్యాహ్నం ఒంటి గంట వరకే సిబ్బంది ఉంటారని స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. సిబ్బంది అందుబాటులో ఉండరని, ఇక్కడ విధులు నిర్వహించే వైద్యాధికారి ప్రతిభను తక్షణమే ఇక్కడి నుంచి బదిలీ చేస్తే తప్ప సిర్గాపూర్ ఆసుపత్రి పనితీరు మార్పు చెందే అవకాశం లేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఒక్క సిర్గాపూర్ ఆసుపత్రి మాత్రమే కాకుండా మండల కేంద్రమైన కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రికి ఓ ఇన్‌చార్జి వైద్యుడిని నియమించారు. సోమవారం అత్యధికంగా రోగులు వస్తారనే కనీస సోయి లేని ఆ వైద్యుడు ఉదయం 9 గంటలకు రావాల్సి ఉండగా 11 గంటల వరకు రాకపోవడంతో రోగులు అప్పటి వరకూ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి నాలుగు దఫాలుగా సిర్గాపూర్ ఆసుపత్రిని తనిఖీ చేసి పరిస్థితిని అర్థం చేసుకున్నారు. తన నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది పనితీరు సక్రమంగా లేకపోవడమే కాకుండా జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ దృష్టికి పరిస్థితిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి వివరించినట్లు తెలిసింది.

నూతన విత్తన చట్టంతో రైతులకు మేలు



పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతు వేదికలో నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతన విత్తన చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్ తెలిపారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖాధికారులు రైతులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త విత్తన చట్టంలో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని రూపొందించారన్నారు. అనంతరం శాస్త్రవేత్త ఉమారెడ్డి మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలపాలని దీనివల్ల నేల సారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఝాన్సి లక్ష్మీబాయి, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో పారిశుధ్య కార్మికుల కొరత



జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

పటాన్‌చెరు నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మినీఇండియాగా పేరున్న పటాన్‌చెరు వీధుల్లో చెత్తను శుభ్రం చేయడానికి పారిశుధ్య సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా కాలనీలు పుట్టుకువచ్చాయని, ఇందుకు తగ్గట్టుగా సిబ్బందిని పెంచకుండా ఉన్నవారితో పనులు చేయించుకుంటున్నామని చెప్పారు. నిత్యం చెత్త శుభ్రత సమస్యగా మారిందని వివరించారు. గతంలో మంజూరైన రోడ్లు, శుభ్రం చేసే యంత్రాల వాహనాలు తిరగడం లేదని తెలిపారు. డివిజన్ నుంచి పన్నుల రూపంలో పెద్దఎత్తున వసూళ్లు అవుతున్నా అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదని వివరించారు. డివిజన్ పరిధిలో వసూలైన పన్నుల నుంచి నిధులు విడుదల చేసి, అభివృద్ధికి సహకరించాలని మేయర్‌ను కోరారు.


దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజని.. ఆ రోజున చేపట్టే దీక్షాదివస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదమే నాడు రాష్ట్రానికి ఊపిరిగా మారిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందన్నారు. అటువంటి రోజును తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో 29న నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు మామిళ్ళ ఆంజనేయులు, అంజాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పట్లోరి రాజు, గుంగుల విష్ణువర్ధన్, లింగారెడ్డి, జుబేర్, విశ్వం, భీమరి కిషోర్, ఆర్‌కె శ్రీనివాస్, మాయ మల్లేషం, సుజాతశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ



దాయర రోడ్డులో అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చుతున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దాయర రహదారి విస్తరణకు గల అడ్డంకులను మున్సిపల్ అధికారులు ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. ఈనెల 19వ తేదీన 'దాయర రహదారి విస్తరణకు మోక్షమెన్నడో' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. చమన్ మీదుగా దాయర వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉండగా కొన్ని కట్టడాల వల్ల పూర్తిస్థాయిలో లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. కొన్ని భవనాలు కూల్చకపోవడంతో సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ ముందుకు వెళ్లలేకపోతున్నారు. కొన్ని నెలలుగా పనులు ఎక్కడికక్కడే ఆగిపోవడంపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో దాయర వెంట గల సుమారు 60 మీటర్ల ప్రహరీని కూల్చివేశారు. మరికొంత గోడను కూల్చివేస్తే కుడివైపుగా రహదారి విస్తరణకు అడ్డంకులు తొలగిపోయినట్లేనని టౌన్‌ప్లానింగ్ అధికారి భూపతి తెలిపారు.

తూప్రాన్ పట్టణంలో భారీ చోరీ

- 6 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ. 20వేల నగదు చోరీ



ఘటనాస్థలంలో చిందరవందరగా పడిఉన్న వస్తువులు

తూప్రాన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగ్లా పై అంతస్తులోని గదికి తాళం వేసి కింది అంతస్తులో కుటుంబీకులు పడుకోగా, దొంగలు తాళం పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ సాయినగర్ కాలనీలో ఫిరోజ్ కుటుంబం నివాసముంటుంది. ముగ్గురు సోదరులు ఒకే భవనంలో వేర్వేరుగా నివాసముంటున్నారు. రెండో అంతస్తులో ఆస్రాఫ్ అలీ నివాసముంటుండగా, భార్య మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఆస్రాఫ్ అలీ ఇంటి వద్దనే ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఆస్రాఫ్ తాను ఉండే పోర్షన్‌కు గదులకు తాళం వేసి గ్రౌండ్ ఫ్లోర్షన్‌లో ఉండే తల్లి వద్ద పడుకున్నాడు. రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు, రూ. 20వేల నగదు, రెండు విలువైన వాచీలు దోచుకున్నారు. బుధవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ బృందం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

సీడ్ కంపెనీ గోదాంలో రూ. 30 లక్షల స్టాక్ చోరీ

తూప్రాన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీడ్ కంపెనీ గోదాంలో నిలువ చేసిన విలువైన కెమికల్ బాక్స్‌లు, గన్నీ బ్యాగులో చోరీకి గురయ్యాయి. ఈ మేరకు సీడ్ ప్లాంట్ ఇన్‌చార్జి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. తూప్రాన్ మండలం జెండాపల్లి శివారులో కోర్‌జెన్ సీడ్స్‌లో గుజ్జరి రమేష్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. కోర్‌జెన్ కంపెనీ, అభిష్ట అగ్రి సోల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఒకే గోదాం వినియోగిస్తున్నారు. గోదాం మధ్యలో పార్టీషన్ ఏర్పాటు చేసుకొని నిల్వలు పెట్టుకుంటున్నారు. 24న సోమవారం సాయంత్రం యథాప్రకారం గోదాం తాళం వేసి రమేష్ ఇంటికి వెళ్లి పోయాడు. మంగళవారం ఎప్పటిలాగే కంపెనీకి వచ్చి గోదాం తెరవగా పార్టీషన్ పూర్తిగా తొలగించి ఉన్నట్లు గమనించారు. అందులో ఉంచిన రూ. 30 లక్షల విలువైన కెమికల్ బాక్స్‌లు, గన్నీ బ్యాగులు, ఇతర పదార్థాలు చోరీకి గురయ్యాయి. అలాగే కాటన్ సీడ్ స్టాక్ దెబ్బతిన్నట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వ్యక్తికి తీవ్ర గాయాలు

మనూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టిప్పర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పుల్‌కూర్తి సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన పోచయ్య పనుల నిమిత్తం బైక్‌పై జహీరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి పనుల్లో ఉన్న మొరం టిప్పర్ బైక్‌ను ఢీ కొనడంతో పోచయ్య కాలు నుజ్జునుజ్జయింది. క్షతగాత్రుడిని నారాయణఖేడ్ వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు.

చౌటకూర్ వద్ద జాతీయ రహదారిపై కారు బోల్తా



అదుపు తప్పి బోల్తా కొట్టిన కారు

పుల్‌కల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ శివారులో సంగారెడ్డి, నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి వైపు నుంచి జోగిపేట వైపునకు వెళ్తున్న కారు వేగంగా ప్రయాణిస్తూ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ విషయం తెలుసుకున్న జాతీయ రహదారి అంబులెన్స్ సిబ్బంది హుటాహుటినా ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం బోల్తా పడిన కారును క్రేన్ సహాయంతో తొలగించారు.

అనుమతి లేని పనులు చేస్తే చర్యలు: డీఆర్డీవో ఏపీడీ

హవేళిఘణపూర్, నవంబరు 25,(ఆంధ్రజ్యోతి); ఉపాధిహామీ పథకంలో అనుమతి లేకుండా పనులు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో ఏపీడీ రంగాచార్యులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 4వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు, కూలీలకు చెల్లించిన డబ్బుల వివరాలను గూర్చి తనిఖీ నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో ఈ పథకం కింద చేపట్టి 364 పనులకు గానూ మొత్తం రూ.7,31,71,000 వ్యయం చేసినట్టు తెలిపారు. కాగా సరైన కారణాలు లేకుండా చెల్లించిన రూ. 1,78,043 రికవరీ చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో మొత్తం 56 పనులకు మొత్తం రూ. 3,13,97,000 వ్యయం అయ్యాయన్నారు. అవకతవకల కారణంగా రూ.14 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రాజేందర్ రెడ్డి, సంపత్, పాండరీ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం గారూ.. ఆశాలకిచ్చిన హామీ ఏమైంది?



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆశాలతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ ఏమైంది సీఎం గారు..అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రశ్నించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆశాలతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆశావర్కర్లకు రూ.18 వేలు ఫిక్స్ వేతనం ఇస్తామని గద్దెనెక్కాక మర్చిపోయారా..? అని ఎద్దేవా చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, యశోధ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు స్కీమ్‌లను ప్రైవేటుకు వద్దు

- డీసీఎల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ధర్నా

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమ బోర్డు స్కీమ్‌లను ప్రైవేటుకు అప్పగించవద్దని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ. రహ్మాన్, వెంకట్రాజంలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని డీసీఎల్ కార్యాలయం ముందు మంగళవారం ఏఐటీయూసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో కార్మికులకు అందించే స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించకుండా ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు పెన్షన్ వర్తింపచేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి శివశంకర్ అన్నారు. అనంతరం ఏఎల్‌వో నీరజకు వినతిపత్రం అందజేశారు.



అభినందన

జాతీయ స్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో సంగారెడ్డి జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ప్రాజెక్టు(స్మార్ట్ లైఫ్ సేవర్ స్టిక్ ఫర్ ఫార్మర్స్) ప్రదర్శించి ప్రతిభ కనబర్చిన ఇస్నాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అంకిత్‌కుమార్, శాంసన్, గైడ్ టీచర్ భాస్కర్‌దేశ్‌లను అభినందిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.

-సంగారెడ్డి అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి)